# పుణ్యమా - పాపమా

పాలడుగు వెంకటేశ్వరరావు



సూర్యకాంతానికి జుట్టు పీక్కోవాలని పించింది.

ఉరేసుకోవాలని పించింది.

ఇంత కిరసనాయిలు తెచ్చి అగ్గిపుల్లగీసి ప్రపంచాన్నంతా తగల పెట్టెయ్యాలని పించింది.

చచ్చి పోవాలనిపించింది.

భోరుమని ఏడవాలనిపించింది. ఇంకా ఏమేమో చెయ్యాలనిపించింది కాని...

ఏమీ చెయ్యలేక పోయింది.

పై కప్పు వంక చూస్తూ పిచ్చిదానిలా వుండిపోయింది.

బయట రోడ్డుమీద ఆగినకారు—తళ తళ మెరుస్తూన్న రంగులకారు — కదిలి పోవటం ఆ బరబరధ్వని సూర్యకాంతం గుండెల్ని దొల్చేసింది.

వెంకట్రావు వంటి బండపెదాలూ సిగరెట్టు వాసనా, చమటకంపూ బానలాంటి పొట్టా, ఏనుగు తొండాల్లాంటి కాళ్ళూ బాగా సీకూరిన అసహ్యకరమైన అతని శరీరమూ—అన్నీ మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వచ్చి గుండెల్ని పిండేసేయి.

అంతే!

సూర్యకాంతం పిచ్చిదాన్లా చూస్తూండి పోయింది.

వెంకట్రావు తుమ్మెదలా మధువుని జుర్రుకుని సూర్యకాంతాన్ని ఆ మొగదిలో పారేసి తనదార్ని తను పెద్దమనిషిగా మిగిలిపోయాడు.

* * *

ఆ పొద్దుంత్రం ...అబిద్ సెంటర్లో రంగురంగుల దీపాల్లో మిలమిల మెరిసి పోయే నాగరికతనూ, డబ్బువెంట తిరుగుతూ బుసలు కొడ్తున్న అహంకారాన్ని అజ్ఞానాన్ని ఆలోచ్చులోనిండా మిగిలిపోయి కన్నూమిన్నూ కానరాకుండాపోయిన మనుషుల్ని చూసి సూర్యకాంతం జాలిపడింది. అవును సూర్యకాంతం, జాలిపడిందిగాని; వాళ్ళని గురించికాదు!

తనగురించే.

అవును. సూర్యకాంతానికి తన్నిచూసి తనకే అమితంగా జాలికలిగింది.

ఆ జాలిలోనే సూర్యకాంతం కొన్ని వచ్చి నిజాల్ని మర్చిపోయింది.

దీర్ఘకాలంగా జబ్బుతో తీసుకుంటున్న తండ్రి, తన బి. ఏ. చదువుకోసం వున్న కాస్త కొంప్రా అమ్మి తనవింతదాన్నిచేసి తనమీదే ఆశలు నిల్పుకున్న పిచ్చితల్లి, తన పేదో గొప్పదాన్నిగా వూహించుకుంటూ ఏదో తప్పి తలకెత్తుతుందనీ వుద్ధరించి వూరేగిస్తుందనీ, పెద్దక్కవింతో గొప్పద్న

పట్నంలో కాలుకింద పెట్టకుండా పెద్ద వుద్యోగం చేస్తుందని కలలు కంటున్న చెల్లెళ్లూ — తమ్ముళ్లూ వాళ్లుండే పూరికొంప, నాళ్లు చిరిగిన బట్టలూ, తీరుకుపోయిన ఆశలు నిండిన కళ్లూ... ఇవన్నీ తలపుకి వస్తే సూర్యకాంతానికి భయం, అసహ్యం...అందుకే వాట్ని మర్చిపోటానికి ప్రయత్నం చేస్తుంది సూర్యకాంతం.

తన యవ్వనాన్ని తినేసేట్టు చూసే ఆకలిచూపులూ, తన బీదతనాన్ని అవహేళనచేసే ఎత్తిపొడుపు మాటలూ అంటే మొదట్లో సూర్యకాంతం భయపడేది. క్రమక్రమంగా సూర్యకాంతం గుండె బండబారింది. ఆ బండతనం ద్వేషంగామారింది. తరవాత్తరవాత అది కసిగా మారింది.

ఆ కసి ఎవరిమీద?

ఎందుకు?...

అందీ అందని ఆశలు, వుక్కిరి బిక్కిరి చేస్తున్న ప్రపంచం, తళతళమెరిసి జిగ్నల దగ్గరకులాగే రంగులు, ఆ వెనకే కవ్వించీ కవ్వించక వికృతంగా నవ్వే నగ్ననిజాలు

ఒంటరితనం, ఆడతనం, చేతకానితనం బీదతనం, ఇరవయిమూడేళ్ల కన్యత్వం... ఇదీ తను. తప్పనిసరిగా తెచ్చిపెట్టుకున్న ఆడంబరాన్ని నిల్పుకోటానికి తిండికీ, బస్సు చార్జీలకీ, చీరలకీ, పౌడర్లకీ చాలీచాలని జీతం. అందులో మిగిల్చి ఇంటికి ఏమీ పంపించలేక పోయినందుకు ... తన అశక్తత్వానికి, అసహాయతకి తనమీద తనకే కోపం.

ఆఫీసులో గుసగుసలు. తనకీ ఆఫీసరు వెంకట్రావుకీ ఏదో సంబంధముందని పుకార్లు. తోటివాళ్ల జెలసీ, విఫల మనోరథుల ద్వేషాలు, దొంగచూపులు, దగ్గరకి రావాలని, వూసుకుతిరగాలి అన్న తాపత్రయాలు. వెంకట్రావు తన్ని తినేసేట్టు చూస్తాడు; మాటి మాటికి తన గదిలోకి రప్పించుకుని ఏదో పని చెప్తాడు. తనతప్పా...?

ప్రపంచంలో నమ్మకం లేదు. ధర్మం లేదు. అహంకారంతో, ద్వేషంతో స్వార్థంతో ఈ ప్రపంచం కొట్టుకుపోతూంది. తనలాటిది ఈ పరిస్థితుల్లో వుక్కిరి బిక్కిరవుతుంది. తప్పటడుగు వేస్తే కాలుజారి అధఃపాతాళానికి జారిపోతుంది. గుర్తుకుకూడా అందదు. అవును!

సూర్యకాంతం పులికిపడింది. తన కొలీగ్ శ్యామల ఎవరో యువకుడి చెయ్యి పట్టుకుని నవ్వుతూ కబుర్లుచెప్తూ తన ప్రక్కగానే దూసుకుపోయింది. తనని గమనించనుకూడా లేదు.

ఇంతలో...

'హలో సూర్యం!'

సూర్యకాంతం వెనక్కితిరిగి చూసింది.

రాజ్యం నవ్వుతూంది, ఎర్రగా, లావుగా సపోటాపండులా వుంది. చేతుల్నిండా ఏవో పాకెట్స్, పెదాల లిప్‌స్టిక్ సరిగా అను రక అసహ్యంగా...

'ఇప్పుడేం చేస్తున్నావ్ ... ఎక్కడ? పెళ్లయిందా...?' ఇంకా ఎన్నో ప్రశ్నలు. చాలా కబుర్లు. వుక్కిరి బిక్కిరి చేసింది రాజ్యం.

రాజ్యం తనకి బి. ఏ. లో క్లాసుమేటు. బాగా డబ్బుంది. వాళ్ల నాన్నకి బిజినెస్. పెద్ద అందగత్తెగాదు. పైగా లావు ఇప్పుడు మరీ లావయింది.

అందుకే ... ఆ రోజుల్లో ప్రభాకర్ రాజ్యాన్ని ఆటలు పట్టించేవాడు.

ప్రభాకర్!

అందానికి, మగతనానికి ప్రతిబింబమయిన ప్రభాకర్. ఎందర్నో కాదని అవతలికి తోసేసి కావాలని తనదగ్గరకి వచ్చాడు. తను ఎంతదూరంలో వుంచినా అతనే ...

ఆ రోజు పిక్నిక్‌కి అందరూ గండిపేట వెళ్లినప్పుడు ... తను వొంటరిగా దొరికిన క్షణం...అతనుపయోగించుకున్నాడు.

'చూడండి, సూర్యకాంతంగారూ! నేనంటే ఎందుకంత ముభావంగా వుంటారు? ఆ రాజ్యం చూడండి. గిరిజ వాళ్లంతా నా కోసం ఎగబడతారు. ప్రాధేయపడ్తారు. నా మనసేమో ఒక అందమయిన చిన్నారికి చిక్కింది. ఆ చిన్నారికి నేనంటే కోపం. ఎందుకో నాకు తెలీదు.' అని అదోలా చూశాడు.

తన పెదాలు విరిసాయి. అతని మాటలకి నవ్వువచ్చింది. గర్వపడింది.

అవును. ప్రభాకర్ అందగాడు. ఐశ్వర్యవంతుడు. అతడు ఏరికోరి తననే వరించాడు. కావాలని అర్రులు చాచిన రాజ్యం, గిరిజ, వనజ...అందర్నీ తిరస్కరించాడు. అంటే తనఅందం...అంత గొప్పది. ఇంకా ఏవేవో చెప్పాడు ప్రభాకర్. అట్లా తను ప్రభాకర్ ప్రణయంలో పడిపోయింది. కాలం తెలీకుండానే దొర్లిపోయింది..

కాలేజీచదువు ముగిసింది. జీవితం ఎదుట నిల్చింది. ఎవరిదారి వారిదయింది.

తరవాత ప్రభాకర్ ఏమయాడో ... మనిషి కనపడకుండా పోయాడు. ఎన్ని కబుర్లు చెప్పాడు! అంతా బూటకమేనా? ప్చ్...ఏం మనుషులు. ఈ మగవాళ్లంతా ఇంతేనా?...

'ఏమిటాలోచిస్తున్నావు? సూర్యకాంతం. రా. మా ఇంటికెళ్దాం' అంటూ టాక్సీలోకి లాగింది రాజ్యం. త్రోవపొడుగూతా ఏవో కబుర్లు చెప్పింది రాజ్యం. చాలసేపు తర్వాతగాని ప్రభాకర్‌చుట్టూ తిరుగుతూన్న తన మనస్సుని తిరిగి తెచ్చుకోలేక పోయింది సూర్యకాంతం.

టాక్సీ ఆగింది. డబ్బులిచ్చేసి అందమయిన రెండంతస్తుల మేడలోకి తీసుకెళ్లింది సూర్యకాంతాన్ని రాజ్యం. అంతవరకూ సూర్యకాంతం వూహించిందే. కనక ఆశ్చర్యపోలేదు రాజ్యం టీ ఇచ్చింది. కాసేపు కబుర్లయేయి.

'రాజ్యం' లోపల్నుంచి పురుష కంఠం కేకేసింది. కేకేస్తూనే టై కట్టుకుంటూ హాల్లోకొచ్చాడు. రాజ్యం నవ్వుతూ అంది. 'అన్నట్టు అసలు విషయం చెప్పటం మర్చిపోయాను సుమ. ప్రభాకర్ తెల్సుగా అతనే నా 'హబ్బీ'. గుడ్‌ఫెలో. మాట్లాడుతుండండి. ఇప్పుడే వస్తా' రాజ్యం లోపలికెళ్లింది.

తెల్సినవాళ్లే అయినా మళ్లీ పరిచయాలు చేసింది రాజ్యం! మొహాల్లో రంగులుమారినా గుండెల్లో లావా పొంగినా అంతా లోలోనే. నవ్వుతూ మాట్లాడేడు ప్రభాకర్. అంతా కృతకం. ఏవో కబుర్లు చెప్పేడు. తర్వాత — పెద్దవాళ్లకోసం — రాజ్యాన్ని తను ఎట్లా పెళ్లిచేసుకున్నాడో చెప్పేడు — ఇష్టం లేకుండానేట. అతను ఏదో ఫర్మ్‌కి మేనేజింగ్ డైరెక్టరట. హెడ్డాఫీసు ఇక్కణ్నుంచి కలకత్తాకి మార్చేరుట. ఒకటి రెండు రోజుల్లో వెళ్లిపోతార్ట. అన్నీ అధికారానికి ఐశ్వర్యానికి సంబంధించిన కబుర్లు. అంతా మోసం. దగా. ఇంత ద్రోహం చేసీ ఏమీ కానట్టు కబుర్లు. నటన. రాజ్యం తిరిగి వచ్చింది. సూర్యకాంతం ఏడుపు వాపు

కుంది. కాసేపట్లో ద్వేషంతో బుసలు కొట్టింది.

అవును. తను ఆ దుర్మార్గుడికి లొంగి పోకూడదు. వాడు పశ్చాత్తాపపడాలి. అంతే. అందుకే వాళ్లతో చెప్పింది సూర్యకాంతం. కావాలనే అట్లా చెప్పింది.

'తనకీ పెళ్లయింది. తనభర్త సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు. నెలకి రెండువేలు జీతం. కారు బంగళా. ఇటీవలనే ఫారిన్ వెళ్లి వచ్చారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇంకా పిల్లల్లేరు. తనూ ఎంతో సుఖంగా వుందిప్పుడు.'

ఆ మాటలు చెప్తూ వాళ్ల ముఖ కవళికల్ని గమనించింది సూర్యకాంతం. ప్రభాకర్ మొహం తెల్లబడింది. రాజ్యం అదే పనిగా పెదాలు కొరుక్కుంది.

కాసేపు కబుర్లయ్యాయి.

'అన్నట్టు రేపు మా ఇంట్లో కొందరు మిత్రులకి 'పార్టీ' ఇస్తున్నాము. దూరం వెళ్లిపోతున్నాము గదా. పద, సూర్యకాంతం. మీ వార్ని స్వయంగా ఆహ్వానిస్తాను.' అన్నాడు ప్రభాకర్. సూర్యకాంతం కంగారు పడింది. వెంటనే నిలద్రొక్కుకుంది.

'మా వారు బొంబాయి వెళ్లారు. బహుశా రేపుదయం వస్తారు. మరేం ఫర్వాలేదు. నేను తీసుకొస్తాగా. వారికి ఆ పట్టింపులేం లేవు' అంది సూర్యకాంతం.

వాళ్లిద్దరూ వచ్చేప్పుడు మరీ మరీ చెప్పారు సాయంత్రం ఆరింటికి పార్టీకి తప్పకుండా రమ్మనమని, వాళ్ల కారు పంపించారు. బజార్లో దిగి, 'పన్చూచుకుని టాక్సీలో వెడతాన'ని చెప్పి కారు వెనక్కి పంపించేసి ఇంటికొచ్చింది సూర్యకాంతం.

గుండెల్నిండా భయం, ఆందోళన, కసి, వింతమోసం. ప్రభాకర్ మనిషేనా ...?!

ఆ రాత్రి కళ్లు మూతలు పడలేదు. ఆలోచనలతో బుర్ర వేడెక్కింది. చివరికి ఒక నిర్ణయానికివచ్చి నిద్రపోవటానికి ప్రయత్నించింది సూర్యకాంతం.

*  *  *

పార్టీ బాగా జరిగింది.

అందరూ పెద్ద పెద్దవాళ్లే. ఎన్నో కార్లు వచ్చాయి.

సూర్యకాంతం ఎంతో అందంగా తయారయి 'అతనో' కార్లో వెళ్లింది. ప్రభాకర్ కళ్లలో జెలసీ స్పష్టంగా గమనించింది సూర్యకాంతం. తనతో ఏకాంతంగా మాట్లాడడానికి అతను చేసిన ప్రయత్నాలన్నీ కావాలనే విఫలం చేసింది సూర్యకాంతం.

పార్టీ అయిపోయింది. దర్జాగా వెంకట్రావు చెయ్యిపట్టుకుని కారెక్కింది సూర్యకాంతం. సెలవు తీసుకునేటప్పుడు ప్రభాకర్ కళ్లలోని ఎర్రజీరని గమనించి తృప్తిగా నవ్వుకుంది సూర్యకాంతం. అవును. ప్రభాకర్ ఎందుకలా అయిపోయేడు...!?

ఇంకోగంట సేపట్లోనే ... వెంకట్రావుతో తను చేసుకున్న ఒప్పందం ప్రకారం —వెంకట్రావు బంగ్లాలో—డన్లప్‌పిల్లోల మధ్య మెత్తటి పరుపుల్లో అతనికి లొంగి పోయింది సూర్యకాంతం, అయిష్టంగానే.

ఉద్రేకం చల్లారేక, ఆవేశం, జెలసీ, పగ నీరయ్యాక మామూలు స్థితికి ఒచ్చేక జరిగిందాన్ని గురించి పునరాలోచించుకుని జరగాల్సిందాన్ని గురించి ఆందోళన పడింది సూర్యకాంతం.

అందుకే వెంట్రావుని అడిగేసిందమాయకంగా, తనని పెళ్లిచేసుకోమని.

వెంకట్రావు నవ్వేడు; సూర్యకాంతం అమాయకత్వానికి; ఆ ప్రశ్నకీ.

'నాకు నలుగురు పిల్లలు. ఐదో దాన్ని కంటానికి నా భార్య పుట్టింటికి వెళ్లింది. నిన్ను పెళ్లిచేసుకుంటే జైలు పిలుస్తుంది. అదెట్లా వీలయేట్టు?' అన్నాడు. ఏవో కబుర్లు చెప్పాడు. సంతోషంగా వుండమన్నాడు. ఏం ఫర్లేదన్నాడు. కారులో ఇంటికి పంపేడు.

వెంకట్రావు కారులో సూర్యకాంతం తన గదికి వచ్చేసరికి పదకొండు గంటలయింది. డ్రయివర్ని ఆగమని, కలంతీసి కాగితంమీద ఏదో రాసింది.

'నీకు ప్రభాకర్‌గారి ఇల్లు తెల్సుగా?' అని అడిగింది. డ్రయివరు మెత్తగా నవ్వాడు.


'అవునమ్మా. మిమ్మల్ని అక్కడ్నించి తీసుకొచ్చింది నేనేగా.'

'ఈ చీటీ ప్రభాకర్‌కి అందచెయ్యి చెయ్యగలవా?'

డ్రయివరు తలవూపి ఆ కాగితం అందుకున్నాడు. ఇంకా అక్కడినుంచి కదలకుండా నిలబడిన డ్రయివర్ని 'ఇంకా ఏవిటి' అని అడిగింది సూర్యకాంతం.

'ఇందాక పార్టీ జరిగేటప్పుడు ప్రభాకర్‌గారు నాదగ్గరకి వచ్చి ఈ వుత్తరం మీకు ఇమ్మన్నారు. ఇమ్మంటారా? అమ్మా' డ్రయివరు సందేహంగ అన్నాడు.

'అతని చేతిలోంచి చీటీ లాక్కుంది సూర్యకాంతం,



గబగబా తలుపులేసి లోపలికెళ్ళింది సూర్యకాంతం. ఒంట్లో నీరసంగా వుంది. తల తిరుగుతూంది.

తను ప్రభాకర్ కేం రాసింది... 'దుర్మార్గుడా! నీ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. నీ గురించే నేను నాశనమయి పోయాను. నిన్ను దేవుడుకూడా క్షమించడు'—అని.

అప్రయత్నంగా సూర్యకాంతం దృష్టి తన చేతిలోని వుత్తరంపై పడింది. కవరు చించి గబగబా చదివింది. అవును. అది ప్రభాకర్ రాసిందే.

అంతే! అజ్ఞాసి సూర్యకాంతం నీరసంగా చాపమీద కూలబడిపోయింది. అప్రయత్నంగానే కళ్ళంట జలజలా నీరుకారి చంపల్ని తడిపేసింది.

'అంతటా—దొంగలు, త్రాగుబోతులు, మోసగాళ్ళు విశృంఖలంగా విహారం చేస్తూ చెలాయిస్తూవున్న ఈ వాతావరణంలో, ఇటువంటి స్థితిలో నన్నెందుకు నిలిపావు దేవుడా' అని ఆమె గుండె ఘూర్ణిల్లింది.

ఆ పరిస్థితుల్లో...సూర్యకాంతం జుట్టు పీక్కోవాలనుకుంది.

ఉరేసుకోవాలనుకుంది. భోరుమని ఏడ్చి చచ్చిపోవాలనుకుంది.

కాని ఏమీ చెయ్యలేక పిచ్చిదాన్లా చూస్తూ వుండిపోయిందంతే!

సూర్యకాంతం చేతిలోని ఆ వుత్తరం క్రిందపడి దీపం దగ్గరికి కొట్టుకొచ్చింది గాలికి...దీపం వెల్తురులో ఒక పురుగు దాన్నిట్లా చదివింది.

'పిచ్చిదానా! నాకు మళ్ళీ నువ్వూ జీవితంతో రాజీపడ్డావనుకున్నాను. కాని ఇదేమిటి?......నీగురించి నాకంతా తెల్సు. వెంకట్రావు నాకు 'తెలియని వాడని' నువ్వు అనుకుంటే అది నీ భ్రమే. ప్రతిదీ మన మనకున్నట్టు జరగదు. అందుకని గుండెలు ముక్కలు చేసుకుని బ్రతుకు బండలు చేసుకుంటావా? తీపితోపాటు చేదుకూడా లేకపోతే జీవితంలో మొహం మొత్తుతుంది. అయినా, జరిగిపోయిన దురదృష్టంకోసం, రాబోయే జీవితాన్ని త్రోసి రాజనటం ఏం న్యాయం? ఎంత చిన్నదైనా సరే ఒక దీపం వెలిగించుకో. ఈ అడ్డుదార్లు మానివెయ్యి. అశాశ్వత మయిన మన జీవితాల్లో ఇట్లాటి అపసవ్యపు పన్లే మాయని మచ్చలుగా మిగిలిపోతయ్యి...ప్రభాకర్. ●


# ఆంధ్రసచిత్రవారపత్రిక

## 1969 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించపోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము. రచయితలందరూ ఎప్పటి వలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

**మొదటి బహుమతి రు. 2300**

**రెండవ బహుమతి రు. 1600**

**మూడవ బహుమతి రు. 550**

### నిబంధనలు

1. కథలు ఇంతకిముందు అచ్చుఅవని స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేనని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీ రాసి పంపాలి. ఈ హామీలు వేరేకాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు.

4. కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేదీ 30—8—69. ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 7—11—69 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్ళలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవసరం లేదు.

9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.